ఏకాంతం

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

ఆనందరావు సిగరెట్ వెలిగించాడు. అగ్గి పుల్లను జాగ్రత్తగా కిటికీగుండా చీకట్లోకి పారేశాడు. వచ్చి కుర్చీలో కూర్చున్నాడు. పాదరసంలా పరుగెత్తే మనస్సుని చిక్కబట్టే ప్రయత్నంలో నిమగ్నుడయ్యాడు. చదవటానికి ప్రయత్నించి చదవలేకపోయిన ఫైలు చేతులు చాచుకుని ఎదురుచూస్తూ టేబిల్ మీద అలానే వుంది.

మండుతున్న సిగరెట్ కొస వేడిమి క్రమంగా వేళ్లను తాకుతోంది. ఆలోచన పొందుతున్న నిలకడలో మనస్సు తన నీడని తాను చూచుకోగలుగుతోంది. ప్రజ్వలిస్తున్న నిప్పు కణికమీద క్రమంగా ఏర్పడుతున్న మసి వైనం గమనిస్తూవుంటే ఏదో ప్రశాంతి, నిండుదనం..

"మళ్లీ ప్రారంభించారూ! దొంగచాటుగా ఏమిటీ పని?" అన్నది కమల. భార్య రావటాన్ని అతను గమనించనే లేదు. దొంగతనంచేస్తూ పట్టువడిన చిన్నపిల్లవాడిలాగా, చప్పున సిగరెట్‌ను పారేశాడు ఆనందరావు.

"పాపం ఎంత బిజీగా ఉన్నారో, చప్పుడు చెయ్యకుండా పాల గ్లాసు పెట్టి వచ్చేసెయ్యాలి అని అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చాను... తీరా చూస్తే చాలా దీక్షగా చదివేస్తున్నారు, సిగరెట్‌ని ! ఆఁ ! ఏమిటి చెప్పండీ యిది ? ఇదేనా మీ గొప్ప సంకల్పబలం ? ఆమాత్రం నిగ్రహం లేకపోతే ఎలా ? మి ఆరోగ్యం సంగతి మీకు తెలిసుండి కూడా యిలా చేస్తారా ?"

ఆనందరావు ఆమెవైపు బెరుగ్గా చూచి, చిరునవ్వు నవ్వటానికి ప్రయత్నించి, విఫలుడై, పాల గ్లాసుని పెదవులకు అడ్డంగా పెట్టేసుకున్నాడు. కమల చూస్తూ నిలుచుంది. గ్లాసు ఖాళీచేసి మాట్లాడకుండా ఆమె చేతి కిచ్చాడు ఆనందరావు.

"అవెక్కడున్నాయో, అవీ ఇలా యిచ్చెయ్యండి .... మీతో చర్చలు చేసీ, నచ్చజెప్పీ లాభంలేదు ! మీ కేమన్నా తెలీకపోతే కదా నచ్చజెప్పటం ! అన్నీ తెలుసు, కథ మాత్రం మళ్లీ మొదటికే వస్తుంది. .... నిన్న రాత్రి దగ్గుతుంటే, ఏమో వేడి చేసింది కాబోలు అనుకున్నాను గాని, ఈ పని మళ్లీ మొదలెట్టారనే రహస్యం తట్టనేలేదు ! ఎందుకు చెప్పండీ, బాధను కోరికోరి తెచ్చుకోవటం ? మిమ్మల్ని ప్రతి క్షణం కనిపెట్టి ఉండాలంటే నాతరమా? .... పోనీ, ఒక ఉపాయం చెబుతా వింటారా ! ఇలా నా చేతిలో చెయ్యివేసి 'ఇంకెప్పుడూ నీ పర్మిషన్ లేకుండా సిగరెట్ కాల్చను' అని చెప్పండి. అప్పుడు ఆ బాధ్యత కాస్త నామీద వేసినట్లుగా మీ మనస్సుకి తేలికగా ఉంటుంది... ఎప్పుడైనా మీకంత కోరిక కలిగితే, ఆరోగ్యం బాగుంటే, కాల్చుకోటానికి పర్మిషనూ ఇస్తాను. ఏమంటారు ? అలా చేస్తే బాగుండదూ ?"

"సరే ఆలోచిద్దాంలే, నన్నింక పని చేసుకోనియ్యి."

"ఆ మిగిలిన సిగరెట్లు యిలా యివ్వండీ."

"అబ్బ ! గొడవ ! పట్టుకుపో."

ఆనందరావు సొరుగు లాగి అందులోని సిగరెట్ పెట్టె భార్య కిచ్చాడు.

"ఆ చేత్తోనే ఒట్టు కూడా వేసెయ్యండి మరి !"

"ఇప్పుడు కాదు .... ఆలోచిస్తాను."

"ఇంకా ఆలోచించే దేమిటీ ? ఇదివరకే అన్ని తర్జన భర్జనలూ జరిగాయి. ఆలోచన కాదు, ఆచరణ కావాలి .... వెయ్యండి ఒట్టూ!"

"ఒట్టుతీసి గట్టున పెట్టి.... Please leave me alone, ఆలోచిద్దాం అన్నానుగా."

"ఆలోచన కాదు, ఆత్మవంచన !" అనేసి కమల వెళ్లిపోయింది.

అవును, ఆలోచన కేమీ మిగల్లేదు. సిగరెట్ మానెయ్యటానికి అన్నీ గట్టి కారణాలే ఉన్నాయి. తన దేహ తత్త్వమూ సిగరెట్‌కు వ్యతిరేకమే ! తన బాధ్యతా, భవిష్యత్తూ అన్నీ బలమైన కారణాలే ! కాని తన మనస్సుమాత్రం ఎందుకని సిగరెట్ వైపు మొగ్గుతోంది? తన సంకల్ప బలానికి ఎందుకు బలం లేక పోతోందీ? ఎందుకు?

ఆనందరావు కిటికీదగ్గరకు వెళ్లి చీకట్లోకి చూస్తూ నిల్చున్నాడు. ఆకాశంలో నక్షత్రాలు మెరుస్తున్నాయ్.......

తనకప్పుడు తొమ్మిదేళ్ల వయస్సు. రాత్రిళ్లు ఏవేళనో మెలకువవచ్చి కళ్లు తెరచిచూస్తే, చిమ్మచీకట్లో చిన్న డేంజర్ సిగ్నల్‌లా ఎర్రగా మెరుస్తూ నిప్పుకణిక రహస్యంగా ఉదయించిన ఎర్రగులాబీమొగ్గలాగా ఒక చోటి నుంచీ మరో చోటికి ఎగిరే వింత కీటకంలాగ కనిపించేది. గదిలో పల్చగా ఆవరించిన ఒక ఘాటు వాసన ఉద్రేకాన్ని కలిగించేది. కుతూహలాన్ని అణుచుకోలేక రహస్యాన్ని చెప్పలేక బరువుగా గుండెల్లో కలిగే ఉద్వేగంలాంటి ఉద్వేగం కలిగేది. ఆ నిప్పు కణిక నాన్నగారు చీకట్లో పడుకునే కాలుస్తున్న సిగరెట్ కొస అని సగం నిద్ర సగం మెలకవగా ఉన్న ఆ సమయంలో గుర్తు వచ్చేదే కాదు ! పగలు నాన్నగారు మామూలుగా సిగరెట్ కాలుస్తూంటటం చూచి, రాత్రి అనుభవం జ్ఞాపకం ఉండి, ఒక్కోసారి రెండింటికీ పోలిక, సంబంధం ఊహించినా అది నిజమనిపించేది కాదు. పగటి కాంతిలో సిగరెట్ పీలగా తెల్లగా ఉండే అల్పమైన వస్తువు! దాని తాలూకు పొగవాసన కూడా ఎబ్బెట్టుగా ఉండేది !

నాన్నగారు చండశాసనుడు ; ఆయన చేసే పనులన్నీ పిల్లలకు నిషేధం. ఆయన చెయ్యలేని పనులు వాళ్లకు విధులు. అందువల్లే ఆయన తన జీవితంలో గడిచి గట్టెక్కలేని స్కూలు ఫైనలు పరీక్ష పిల్లలందరిచేతా ప్యాస్ చేయించారు. తనని ఎం. ఏ. పట్టభద్రుణ్ణి చేశారు. ఆయన సంపాయించినంత డబ్బు మాత్రం తను ఏనాటికీ సంపాయించలేడు. ఆయన తిరిగినన్ని ఊళ్లూ తను తిరగలేడు. ఆయన కుండినంత మంది స్నేహితులూ తనకు లేరు. ఆయన ఇరవై నాలుగ్గంటల్లో కాల్చినన్ని సిగరెట్లు తను వారం రోజుల్లో కూడా కాల్చలేడు. ఇలా ఆయనకీ తనకీ ఎక్కడా పోలిక లేదు ! పోలిక ఉన్నదల్లా ఒక్క సిగరెట్ కాల్చటమే ! అదీ ఆయన యిష్టానికి విరుద్ధంగా, వద్దన్న పని చెయ్యటం ద్వారా, ఏర్పడిన పోలికే !

అయిదో ఫారం చదువుతూ ఉండగా మిత్రుడితో కలిసి ఒక హిందీ సినిమాకి వెళ్లాడు. సినిమాకంటె ఎక్కువ ఉత్సాహాన్ని కలిగించిన సంగతి మిత్రుడు జేబులో నుంచి సిగరెట్ తీసి వెలిగించటం. పెదవుల్ని ముందుకు సాచి, సున్నా చుట్టి అలా ఏర్పడిన సన్నని సందులోంచీ పొగని సూటిగా వెలుపలికి ఊదుతున్నాడు.

సినిమా ప్రొజెక్టరు నుంచీ తెరమీదికి ప్రసరించే వెలుగు కూడా సరిగ్గా అలానే ఉంది.! మిత్రుడు వదులుతున్న సిగరెట్ పొగ ప్రొజెక్టరు నుంచి ప్రసరిస్తున్న కాంతిలో లీనమౌతూ దానికి వన్నె చిన్నెలు దిద్దుతూ ఉండటం ఎంతో గొప్పగా ఉంది. తనకూ అలా చెయ్యాలని కోరిక గలిగింది. మిత్రుడి నడిగి సిగరెట్ పుచ్చుకుని కాల్చే ప్రయత్నం చేశాడు. ఆ ప్రథమ ప్రయత్నము తృప్తికరంగా లేదు కాని సిగరెట్ కాల్చి నాన్నతో సమానత్వం సాధించినందుకు గర్వమే కలిగింది !

ఇంట్లో అడుగు పెట్టగానే నాన్న వేసిన ప్రశ్న : "ఏం సినిమా బాగుందా ?"

"బాగుంది కాని సినిమా అర్థంకాలేదు"

చెంప ఛెళ్లుమన్నది. సినిమా అర్థం కాలేదంటేనూ ఇంత కోపమా నాన్నగారికి! అనిపించింది. కాని సంగతి అది కాదు !

"ఏమిట్రా నీ నోరు వాసన ? తుంట బీడీలు ప్రారంభించావట్రా వెధవా ?"

"కాదు .... సిగరెట్"

"నీకు డబ్బెక్కడిదీ ?"

"స్నేహితు డిచ్చాడు."

"ఎవడ్రా స్నేహితుడు ! ఈ బీడీ సిగరెట్ స్నేహాలు మానెయ్ ...."

తర్వాత చాల రోజుల దాకా సిగరెట్ వెలగలేదు .....

బి. ఏ. చదువుతున్నాడు పట్నంలో. సినిమాహాల్లో సిగరెట్ అప్పటి కింకా నిషేధం కాలేదు. సినిమా చూస్తూ సిగరెట్లు కాలుస్తున్నారు మిత్రులు. ముందువరుసలోని అమ్మాయిల మీదికి పొగ ఊదుతూ, అన్యాపదేశంగా ఛలోక్తులు విసురుతూ సరాగా లాడుతున్నారు. తనూ సిగరెట్ వెలిగించాడు. చేతి రుమాలు అడ్డం పెట్టుకున్న ఆ అమ్మాయి ముసిముసి నవ్వులూ, పక్క చూపులూ, పైట సర్దుకోవడాలూ, మసక చీకట్లో హుషారు కలిగిస్తున్నాయి. సిగరెట్ కీ పుంస్త్వానికీ గల సంబంధం విశిష్టంగా అనుభవానికి వచ్చింది ఆరోజునే !

రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది. వైమానికదళంవారు పట్టణంలోని పౌరులను వివిధ సంస్థలనుంచీ ప్రదర్శనకు ఆహ్వానించారు. కాలేజీలో ఫైనలియర్ విద్యార్థుల్లో వెళ్ల దలచుకున్నవారిని తొమ్మండుగురిని చీట్లువేసి ఎన్నికచేసి కాలేజి ప్రతినిధులుగా పంపారు. అదృష్టవశాత్తు తనకూ అవకాశం లభించింది. స్త్రీల కళాశాలనుంచి విద్యార్థినుల బదులు అధ్యాపకురాండ్రే తయారై తొమ్మిదిమంది వచ్చారు. అతిథుల్ని జంటలుగా చేసి పదిహేను నిముషాలు విమానంలో నగరంమీద త్రిప్పారు. విమానంలో ఒక ముప్ఫయి ఏళ్ల వివాహిత, స్త్రీల కళాశాల లెక్చరరు, తన ప్రక్కన కూర్చోవటం తటస్థించింది. తర్వాత టీపార్టీలో ఆమెతో మరి కొంత పరిచయ మేర్పడింది. టీ తర్వాత తను సిగరెట్ వెలిగించాడు. ఆమె అనుమతి అడగడం మరిచాడు.

"మీరు సిగరెట్ కాలుస్తా రనుకోలేదు నేను" అన్న దామె.

"సారీ. మీకు సిగరెట్ పొగ అంటే పడదు కాబోలు."

"అదేమీ కాదు. మావారు కాలుస్తారు. కాని మీరు నాకంటే చిన్నవారు. మిమ్మల్ని చూస్తే ఎందుకో కాలుస్తారనిపించలేదు."

"జీవితంలో అనుకోనివి ఎన్నో జరుగుతూ ఉండటం, అప్పుడు కాస్త ఆశ్చర్య పడుతూ ఉండటం నాకు తరచు అనుభవమే,

మీసంగతి తెలీదు గాని! మీకు 'షాక్' కలిగిస్తే క్షమించండి.'' అన్నాడు.

''అబ్బే, అదేమీలేదు .... ఎందుకైనా మంచిది, ముందు అనుమతి తీసుకోవటం భావ్యం; మర్యాద; అని అలా అన్నాను'' అంటూ ఆమె నవ్వేసింది. ''ఫరవాలేదు, యిప్పుడు మనం స్నేహితులం, చిన్నా పెద్దా ఏమీ లేదు'' అన్నది మళ్ళీ.

ఆ సంభాషణ ఎన్నోసార్లు తనకు జ్ఞాపకం వచ్చింది. జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఏమిటో హుషారుగా ఉంటుంది.

''ఎందుకైనా మంచిది, ముందు అనుమతి మతి తీసుకోవటం భావ్యం''.... అన్న మాటలే క్రొత్త పెళ్లికూతురు కమల కూడా అన్నది—మొదటిసారిగా ముద్దెట్టుకున్నప్పుడు, ఆమె నోట్లోంచీ జారిన ముత్యాలూ అవే !

కానిఆడవాళ్లనుంచీ అనుమతి పొందటము అంత సులభమా !

కమలకు సిగరెట్ పొగ అంటే ఏవగింపు ఏమీ లేదు. ఎటొచ్చీ సిగరెట్ మూలంగా ఆరోగ్యము పాడవటాన్ని కమల ఆమోదించదు. న్యాయమే. భర్త ఆరోగ్యం సంగతి భార్యకు కాకపోతే మరెవరిక్కావాలి? కమలకు తనమీద సర్వాధికారం ఉంది!

ఆనందరావు తిరిగి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

అతని మనస్సు అసంతృప్తితో కల్లోలంగా ఉంది. చదువు, ఉద్యోగం, పెళ్లి, సంతానము—ఈ మెట్లన్నీ ఉత్సాహంగా ఎక్కినతర్వాత జీవితంలో మిగిలేది : హోదా, డబ్బు, ఆరోగ్యము అనే వాటిని గూర్చిన తాపత్రయం మాత్రమేనా ? అవైనా తీరా చూస్తే ఎవరి కోసం? తన కోసం కావు! పెళ్లాం పిల్లలకోసం, వారి భవిష్యత్తు కోసం! అంటే నలభై దాటాక వ్యక్తిలో మిగిలే 'స్వార్థం' ఏమీ ఉండదు; అది కేవలం 'కుటుంబ స్వార్థం.'—అందువల్ల కమల సలహా చెప్పినట్లు, ఆమె చేతిలో ఒట్టు వేసి ప్రమాణం చేస్తే, ఆరోగ్యానికి శత్రువైన సిగరెట్ గొడవ తనకు శాశ్వతంగా వదలిపోతుంది! కాని అలా చెయ్యటానికి ఎందుకో తనకు ఇష్టం కలగటంలేదు! స్థిమితంగా ఆలోచిస్తేనే తప్ప ఆ ప్రశ్నకు సరియైన సమాధానం లభించదు. ఈ ఊహలూ, జ్ఞాపకాలూ అలజడి కలిగిస్తాయి. మనస్సు ప్రశాంతంగా ఉండాలి ఆలోచనకి! .... అప్రయత్నంగా ఆనందరావు సొరుగు లాగి వెదికాడు—సిగరెట్ కోసం! ఎక్కడుందీ? కమల పట్టుకు పోయింది.

రెండు రోజుల తర్వాత రాత్రివేళ దగ్గుతూ, నిద్ర రాకుండా దొర్లుతూ ఉన్నాడు ఆనందరావు.

''నేను చెప్పిన సలహానూ మీ కక్కర లేదు. మీరు స్వయంగానూ మానుకోలేరు. అయితే ఏం చేద్దామని మీ ఉద్దేశం ? ఏమిటీ మొండితనం ?'' అన్నది కమల.

''అవును, రెండూ చెయ్యలేను........ కొన్నాళ్ళు నన్నిలా ఉండనివ్వరాదూ ! నిత్యమూ దొంగను పట్టుకుని శిక్షించినట్లు శిక్షించకపోతే నేం?'' అన్నాడు విసుగ్గా.

''మీకు నేనంటే అంత కంటకింపుగా ఉందన్నమాట ! నేను చెబుతున్నదాంట్లో మీకు కష్టమైన దేమిటీ? మీ భారం పంచుకోవాలనే గదా ఒట్టెయ్యమన్నాను!''

ఆనందరావు కాస్సేపు మౌనంగాఉన్నాడు. చివరకు నవ్వేస్తూ—

''ఆయనే ఉంటే మంగ లెందుకూ? అన్నట్లు వేసిన ఒట్టు నిలుపుకునే సామర్థ్యమే

వుంటే ఏకంగా సిగరెట్లు మానెయ్యటమే చేద్దును గదా!" అన్నాడు.

కమల జవాబు చెప్పలేదు.

మరుసటి రోజు సాయంత్రం ఆనంద రావు క్లబ్బునుంచి తిరిగి వచ్చేటప్పటికి అతని మంచం చదువుకునే గదిలోకి మార్చబడి ఉంది.

"దగ్గు తగ్గేదాకా మీరీ గదిలో పడు కుంటే బాగుంటుందని మార్చాను" అన్నది కమల.

కమల పట్టుదల మనిషి. గెలిచేదాకా యుద్ధం సాగిస్తూనే ఉంటుంది. అది ఆమె విశిష్టత. తనలో మార్పు తేవటానికి ఆమె చేస్తున్న ప్రయత్నం సరికాదని ఎవ రనగలరు? ఆనందరావు ఏమీ మాట్లాడలేదు.

ఆ రాత్రి దీపం తీసేసి చీకట్లోకి చూస్తూ పడుకున్నాడు. టీ కప్పులో తుపానులా వచ్చింది యీ సిగరెట్ సమస్య. దాని పరిష్కారానికి, కమల తనమీద ప్రయోగించిన ఆయుధం ప్రస్తుతం తను అనుభవిస్తున్న ఏకాంతం.....

ఏకాంతం అంటే ఎవరికీ యిష్టం ఉండదు. ఏకాంతానికి అర్థంలేదు! జీవితానికి మాత్రం అర్థం ఉందా ? ఆ ప్రశ్నకు జవాబు నీతి, ప్రేమ, అధికారం, బాధ్యత, మర్యాద, డబ్బు, ఆరోగ్యం అనే విలువలు—అన్నీ ఏకాం తానికి వ్యతిరేక మైనవే ! అవి యితరులతో మనిషికి గల సంబంధాన్ని రకరకాలుగా నిర్వచిస్తాయి! ఏకాంతం అంటే యితరులతో సంబంధములేని స్థితి. కమల కంటె సన్నిహితులు తన కెవరూ లేరు. ప్రేమతో, బాధ్యతతో, అధికారంతో, భర్త ఆరోగ్యంకోసం ప్రయత్నిస్తున్న కమలకూ తనకూ గల సాన్నిహిత్యం కూడా ఒక సరిహద్దుకు వెలుపలే ఉన్నది. ఏకాంతం ఆ సరి హద్దు. ఆమె ఎంత దగ్గరగా వచ్చినా, తనతో ఏమి పంచుకున్నా, తన ఏకాంతం తనదే ! విచిత్రంగా లేదూ! మనిషి ఏకాంతానికి అర్థం ఉందా? లేదా? యోగులూ, ఋషులూ ధ్యాన ముద్రలో, సమాధ్యవస్థలో తమలో తాము అన్వే షించేది కూడా ఏకాంతం కాక మరేమిటి ? ఏకాంతం సామాజికమైన విలువ కాదు; కాదని దాన్ని త్రోసిపుచ్చటమేనా? దానికి జీవితంతో సంబంధంలేదా ?

ఆనందరావు కేమీ పాలుపోలేదు. సిగరెట్ వెలిగించాడు.

సిగరెట్ కాలుస్తూండగా ఆనందరావుకు అర్థం స్ఫురించింది. హేతువాదం దృష్ట్యా, ఆరోగ్య సూత్రాల దృష్ట్యా, బాధ్యత దృష్ట్యా వదలిపెట్టవలసిన సిగరెట్‌ని తను ఎందుకు వదలిపెట్టలేకుండా ఉన్నాడో కూడా అర్థం తెలిసి వచ్చింది—

చీకటిలో మెరుస్తూ తన ఊపిరితోపాటు స్పందించే ఈ సిగరెట్ కొస, ఈ నిప్పు కళిక, వికసించి ముకుళించే యీ ఎర్ర గులాబీ మొగ్గ, ఇది తన ఏకాంతం ! తనలోని 'తన' స్వరూపం. జీవితానుభవాలు అనే పూసలకి అర్థాన్నీ ఆకారాన్నీ కల్పిస్తున్న అంతస్సూత్రం ఏకాంతం.

సిగరెట్ కాలుతూనే ఉంది